పిన్నలూ, పెద్దలూ...

శ్రీమతి ఆర్. వసుంధర

అప్పుడే ఆఫీసునుండివచ్చి, పడక్కుర్చీలో పడుకుని, కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవాలనుకున్న పార్థసారథిగారికి ప్రక్కింట్లోంచీ వినవస్తున్న పూజతాలూకు మంత్రాలు కర్ణకఠోరంగా చెవులు చిల్లులు పొడిచేస్తున్నట్లే వున్నై. గ్రామఫోను ప్లేటులో నుంచీ ఉచ్ఛస్వరంలో మంత్రాలు వల్లించేస్తున్నాడు బ్రాహ్మణుడు. అది పార్థసారథిగారికి నచ్చకపోవడంవలననే అంతబాధ కలిగిస్తూ ఉండాలి. ఎందుకంటే తెల్లవారినప్పటినుండీ లారీలు, ఊరేగింపులు, కొళాయిదగ్గర తగవులు, కుక్కల కొట్లాటలు, కిటికీల్లోంచీ ఇంటిలోనికి వచ్చిన పిచ్చుకల రొద యిత్యాదులు అనేకం కలసి ఏర్పడిన శబ్దపు హోరు విన్పిస్తున్నా పట్టించుకోని మనిషి అతను. ఈ మంత్రాల శబ్దంమాత్రం అతనికంత కష్టం కలిగిస్తున్నది... వాళ్లు రోజూ ఆ రికార్డును పెద్దగా వేస్తారు, నిజమే. ఒక రోజున ఉదయం ఎనిమిది గంటలకూ, మరో రోజున పదకొండుకూ వేస్తారు. సాయంత్రాలు నాలుగునుండీ ఎనిమిది లోపున ఎప్పుడో వేస్తారు ఒకసారి. అందువలన ఒక వేళాపాళా లేకుండా ఉన్నట్లుండి హోరెత్తిస్తుంది రికార్డు. కాని అంత చీకాకుకు కారణం ఇంతమాత్రంలోనిదే అనుకోడానికి వీల్లేదు.

పార్థసారథిగారికి పూజని గురించి ఏవేవో అభిప్రాయాలున్నై. బాగా చదువుకున్నవారూ ఆలోచనాపరులూ అయివుండికూడా పాతకాలపు వాసనలు విడవని మనిషి అతను. చీకటి మూలలో తళతళ మెరిసే దీపపు సెమ్మెలూ, పసుపు కుంకుమలూ, తాజాపూలూ, నేతిదీపం, అగరువత్తులూ, కొబ్బరినీళ్లూ, కర్పూరం వాసనలన్నీ కలిసిన సువాసనా; ఆ మెత్తని వెలుగులో కనిపించీ కనిపించని దేవుడూ— ఇవన్నీ పూజలో ముఖ్యభాగాలు అతనికి. కాని యీ వూరికి వచ్చిన కొత్తల్లోనే ఆయన భార్య కళ్యాణి యివన్నీ త్రోసిపారేసింది. 'ఇక్కడ అందరూ రంగు రంగుల బల్బులు పెట్టించుకుంటున్నారు దేవుడి దగ్గర. పనుల్లో తీరిక చిక్కకుండా కొట్టుకుంటుండే మా ఆడవాళ్లకి అది ఎంతో సౌకర్యంగా ఉన్నది. క్షణంలో స్విచ్చివేసి వెలిగించెయ్యొచ్చును అన్ని దీపాలూను' అన్నది. ఫలితంగా రంగుల బల్బులూ, ప్లాస్టిక్ పూలహారాలూ దేవుణ్ణి అలంకరించాయి. ఉన్నాడో లేడో తెలియని దేవుణ్ణి ఆరాధించుకుంటూ వుండటం ఒకటే పనికాదు మనుష్యులకు. తప్పకుండా, తొందర తొందరగా చేసుకుంటూ పోవలసిన యితర పనులు చాల వున్నై యిప్పుడు. 'పోనీలే, భక్తితో దేవుణ్ణి స్మరించుకోవడంకదా ముఖ్యం' అనుకున్నారు సారథి. ఈమధ్యన ప్రక్కింటివాళ్లు పూజతాలూకు మంత్రాలూ నామాలూ శ్లోకాలూ కలిపిన రికార్డు ఒకటి తెచ్చారు. పూజ అంతా అనుకోడం తడవుగా ఏమాత్రం శ్రమలేకుండా జరిగిపోతున్నది.

ఆ రికార్డు వినబడినప్పుడల్లా 'వెర్రివాడు వేమారం వెళ్లివచ్చినట్లు' అంటారు సారథి. క్రొత్తగా ఎవరు ఏపనిచేస్తే అది గొప్పదని అనుకరించే కళ్యాణి ఆ రికార్డును కొనకుండావుండాలని ఆయన ఉద్దేశ్యం కావచ్చు. 'చక్కగా మంత్రాలు వినడానికి అంతబాధ పడిపోతారేవిటీ' అంటుంది కళ్యాణి. కాని ఆ రికార్డును కొనాలన్న అభిప్రాయం ఇంతవరకూ వెల్లడించలేదు. దానికీ ఒక కారణం ఉన్నది. ఈమధ్యనే ఒక పండుగ

రోజున ఆ ప్రక్కింటివాళ్ల జవాను రెండిళ్ల మధ్యనా వుండే అడ్డుగోడ దూకివచ్చి కళ్యాణమ్మగారి అరిటాకులు రెండు కోసుకెళ్లాడు. ఇరుగూ పొరుగూ అన్నాక ఒకరితో ఒకరికి అవసరంపడకుండా ఉండదు. అవసరంగా అరిటాకు కావలసివస్తే వీధివాకిట్లోంచీ వచ్చి అడిగి కోసుకెళ్లాలిగాని యిలా చెయ్యడం కళ్యాణికి తప్పుగా దొంగతనంలాగా తోచింది. అదేమిటని అడిగిన పనిమనిషితో 'ఫర్వాలేదులే. మీ అమ్మగారు లోపలుంటారు. మాకు తొందరగా కావాలి' అన్నాట్ట ఆ జవాను. 'ఎంత నిర్లక్ష్యం! ఇట్లాగైతే ఇహ నీది నాది అనేదేముంటుంది ప్రపంచంలో' అని ఉడికిపోయింది కళ్యాణి గుండె. వెంటనే ఆ జవాన్ను పిల్చుకరమ్మని మనిషిని పంపింది. ప్రక్కింటావిడ 'వాడు లేడు. ఆఫీసుకి వెళ్లిపోయాడు అర్జెంటుగా'అని చెప్పి పంపింది. ఇప్పుడే గోడదూకి అవతలకి వెళ్లినవాడు అయిదు నిముషాలన్నా జరక్కుండానే ఆఫీసుకు వెళ్లిపోయాడంటె నమ్మకం కలుగలేదు కళ్యాణికి. బాగా ఆలోచించుకోగా ఆవిడ మద్దతుతోనే వాడీపని చేశాడనీ అనిపించింది. అప్పట్నుండీ ఆ యింటివాళ్లు కళ్యాణికి గొప్పగా కనిపించడం మానేశారు.

స్వతహాగా కళ్యాణి మంచిమనసుకలది. అసూయ, కసి, ద్వేషంలాంటి గుణాలు లేవు. ఏదీ లోతుగా ఆలోచించకుండా సరదాగా కాలం గడిపేస్తుంది. తనకేది తోస్తే అది చెయ్యడమేగాని భర్తమాట మన్నించాలన్న తత్త్వంలేదు ఆమెకు. ఆమె సంగతి సారథిగారికి బాగా తెలుసు. తెలిసినందువలన భార్యమీద అతనికి అపేక్ష జాస్తిఅయిందేగాని తగ్గలేదు. ఒక్కోసారిమాత్రం తన పిల్లలిద్దరూ పెరగవలసిన తీరులో పెరగటంలేదేమోఅన్న అనుమానంవస్తుంది. ప్రపంచాన్ని అర్థంచేసుకుని, వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోగల సమర్థత వాళ్లకి అబ్బటంలేదని అనుకుంటారు. అటువంటప్పుడు వాళ్లకేదైనా తెలియజెప్పడానికి ప్రయత్నిస్తారు. 'నాన్నగారి ఉపన్యాసాలు' అంటూ విధిలేక వింటున్నట్లు వింటారు వాళ్లు. అంతకంటే ఎక్కువగా పట్టించుకోరు. ఆవిషయంలో పిల్లలిద్దరూకూడా పూర్తిగా తల్లిపోలిక అయ్యారు. 'ప్రపంచం అతివేగంగా పెరుగుతూ మారుతూ ఉన్నది, అర్థంకాకుండా. ఈ పిల్లలు ఎట్లా బాగుపడతారో, ఏమో' అనుకుంటారు సారథి.

ఇంట్లో రికార్డరుతాలూకు చీకాకులో ఉన్నప్పుడు ఫాక్సీ మొరిగింది, 'బంధువులొచ్చారు మనింటికి. బాగ్ పట్టుకొని'...అంటూ ఫాక్సీని ఎత్తుకొని ఇంట్లోకి వచ్చింది గౌరి. 'ఎవరూ? కూర్చోమని చెప్పావా ?' అంటున్న తండ్రి ప్రశ్నలకు సమాధానమివ్వకుండా 'మై క్లెవర్, క్లెవర్ ఫాక్సీ...'అంటూ దాన్ని ముద్దుపెట్టుకుంటూ వెళ్లిపోయింది.

వరండాలో యాభైఏండ్ల పెద్దమనిషీ, వెనుక బాగ్ పట్టుకున్న యువకుడూ నిలుచుని ఉన్నారు. దూరప్రయాణంచేసి అలసిపోయినట్లు కనిపిస్తున్నారు. కొంచెం స్థూలశరీరుడుగా ఉన్న ఆ పెద్దమనిషి నలిగిపోయిన షర్టును నలిగిపోయిన పాంటులోనికి టక్ చేసుకున్నారు. నలుపూ తెలుపూగాఉన్న పలచనిజుట్టు రేగిపోయి గాలికి ఎగురుతున్నది. మొహంలో దైన్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఆయన్ని చూడగానే 'పాపం, పెద్దమనిషి ఏదో కష్టంలోఉన్నారు' అనిపిస్తున్నది. వాళ్లు బంధుజనంలోని వారుగా గుర్తుకు రాలేదు సారథిగారికి.

కూర్చున్న తరువాత తనపేరు రామారావనీ, తాను తెనాలిలో ఒక లాయర్ననీ, ప్రక్కనున్నయువకుడు తన కొడుకనీ పరిచయం చేసుకున్నారు.

'మీ ఆఫీసుకు క్రొత్తగా ట్రాన్స్ఫర్ అయి ఒచ్చాడు...మాణిక్యం...వాడు...' అంటూ విషయం చెప్పాలని ప్రారంభించారు కాని ఆవేశం గొంతులో ఉండచుట్టుకపోయి మాట పెగిలిరావడం కష్టమైపోయింది ఆయనకు. కొంచెం నిలవరించుకున్న తరువాత చెప్పినదాని సారాంశం — ఆ మాణిక్యం గొప్ప రోగ్అనీ, రాస్కల్అనీ, ఇంతకుమునుపు తెనాలిలో ఉద్యోగంలో ఉండినవాడనీ, మూడురోజుల క్రితం యీాయన కుమార్తెను తీసుకుని మాయమయ్యాడనీ; అప్పట్నుండీ వాళ్లకోసం వెతుకుతున్నామనీ, అనంతపురంలో ఎవరో బంధువులయింటికి వెళ్లారని తెలిసి అక్కడికి వెళ్లామనీ, నిన్ననే అతను ఇక్కడ ఉన్నట్లు

తెలిసి యిక్కడికి వచ్చామనీ; అతన్ని బాగాతన్ని, తగిన శాస్తిచేసి, కేసుపెట్టి జైల్లోతోయించి తమకూతుర్ని లాక్కుపోవాలని అనుకుంటున్నామనీ; ఈ విషయంలో ఆ మాణిక్యం పై ఆఫీసరుగారైన సారథిగారు పూర్తి సహకారం యివ్వాలనీ అన్నారాయన.

ఆ మాణిక్యం ఉద్యోగంలోచేరి పదిహేనురోజులు సెలవుపెట్టి వెళ్లిపోయాడు. జాయినింగ్ రిపోర్టు యివ్వడానికి వచ్చినప్పుడు చూశారు సారథి. మనిషి సన్నగా పీలగా చాల బలహీనంగా పదహారేళ్ల కుర్రవాడిలా ఉన్నాడు. మాట నిదానంతో మంచివాడుగా కనిపించాడు. సారథిగారికి అతనంటే సదభిప్రాయమే కలిగింది. 'ఆహా, కథానాయకుడే...పైకి ఎంతో సాదాగా కనిపిస్తాడు' అనుకున్నారు.

తల చేతబట్టుకొని కూర్చుండివున్న రామారావుగారు ఏదో జ్ఞాపకంవచ్చినట్లు తలెత్తి 'ఇందాక యిటుగా వెళ్లిన అమ్మాయి మీ కొమార్తేనా?' అన్నారు. అవునని సారథి చెప్పాక 'మా స్వరూప యింకా చిన్నది...మొన్ననే పావడా మానేసి చీర కట్టడం మొదలెట్టింది ..పదిహేనేళ్లు నిండినై, అంతే. అయ్యో, పసిబిడ్డండీ...ఎంతనెమ్మదైన పిల్ల! నోరుతెరిచి ఒక్కమాట మాట్లాడదు. అది యింత పని చేసిందంటే నమ్మలేకుండా ఉన్నాము...' అన్నారు. అతని గొంతులో దుఃఖం ఆశ్చర్యం ఒకదాన్నొకటి తరుముకొస్తున్నాయి. తన కూతురు, అంత అమాయకురాలు తమని వ్యతిరేకించిందంటే అతనికింకా నమ్మకం కలగటంలేదు.

'మా గారికి యింకా పదిహేను నిండలేదు' అన్నారు సారథి, ఏదో ఒకటి మాట్లాడటానికి, వాళ్ల మీద జాలితో.

'ఆహా...మీ బిడ్డే అనుకోండి. అభం శుభం తెలియని పిల్లకు అన్యాయం జరిగిపోతున్నది...ఏం చేసేది! ఇప్పడెట్లాగ?...బంధువుల్లో ఎంత అప్రదిష్ట!'అంటూ దిగజారిపోయారు.

దుఃఖంలోవున్న ఆయన్ని శాంతింపజేసి జరిగిన విషయం కనుక్కున్నారు సారథి. మామూలు కథే. స్కూలుకి వెళ్లివస్తానని మధ్యాహ్నం పుస్తకాలు పట్టుకు వెళ్లినపిల్ల చీకటిపడినా తిరిగి రాలేదు. అమ్మాయి టేబిల్‌మీద ఉత్తరం కనిపించింది. తాను మాణిక్యంతో వెళ్లిపోతున్నాననీ, వెతికి ప్రయోజనం ఉండదనీ, పెళ్లి చేసుకుంటున్నామనీ, తర్వాత తానూ క్రిస్టియన్‌మతం పుచ్చుకుంటాననీ, అనవసరంగా గొడవచేస్తే మాణిక్యం ఉద్యోగంపోయి తాము చాల కష్టపడవలసివస్తుంది గనుక తనమీద కొంచెమైనా ప్రేమవుంటే అటువంటిపని చెయ్యొద్దనీ వ్రాసివున్నదిట.

'ఇదంతా వాడే డిక్టేట్‌చేసి వ్రాయించి వుంటాడు' అన్నాడు యింతవరకూ నోరు మెదపకుండా కూర్చున్న యువకుడు కోపంగా.

పార్థసారధిగారికి వాళ్లమీద జాలి కలిగింది.

'మీ అమ్మాయి వెళ్లిపోయి మూడురోజులు గడిచి పోయింది. ఈపాటికి పెళ్లికూడా అయిపోయేవుంటుంది. ఒకవేళ వాళ్లు మీకు యిప్పుడు కన్పించినా మీ అమ్మాయిని ఇంటికి తీసుకెళ్లి ఏం చేసుకుంటారు? వేరేపెళ్లి చెయ్యలేరు...' అన్నారు కర్తవ్యం వెతుకుతూ.

రామారావు ఒకక్షణం తటపటాయించారు.

'ఈ మూడు రోజులు తిరిగాక మాకూ అలానే అనిపించింది. ఏం చెయ్యాలో తోచడం లేదు...మరీ కిరస్తానీ వాడిని చేసుకోడమా!...' అన్నారు దిగులుగా.

'మీ అమ్మాయికి మన మతం అనిపించలేదు. క్రిష్టియన్ మతం పుచ్చుకుంటానని వ్రాసింది కదా' అన్నారు సారథి.

'వ్రాస్తే! దానిమొహం, దానికేమి తెలుసు? వాడి మాయలోపడి అది గొప్పఅని అనుకుంటున్నదేమోగాని, నిన్న మొన్నటిదాకా ఇంట్లో రాముడికి పూజచేసి దణ్ణాలు పెట్టుకున్నదే గదా. పుట్టిపెరిగిన సొంతమతాన్ని కనుక్కోలేని పిల్లకి పైదాన్నిగురించి ఏం తెలుస్తుంది?' అన్నారు రామారావు.

'ఇందులో పుట్టింది గనుక యిన్నాళ్లూ రాముడికి మొక్కింది. ఇప్పుడతనంటే యిష్టపడింది గనుక అతని దేవుడికి మొక్కుతుంది. ఏ పేరు

పెట్టినా ఆ దేవుడేకదా' అన్నారు సారథి నవ్వుతూ. ప్రక్కింటివాళ్ల రికార్డు మంత్రాల్ని జోరుగా వల్లిం చేస్తున్నది. 'దేవుణ్ణి స్మరించుకోనుగూడా అఖ్ఖ ర్లేదు. మంత్రమో శ్లోకమో కీర్తనో నమాజో ఒకటి కాకపోతే యింకోటి రికార్డు వేసెయ్యొచ్చు' అనుకున్నారు లోపల.

'హు! ఆ పీరు బొమ్మను ఇష్టపడిందా? దొంగవేషాలువేసి...యువకుడు ఉద్రేకంతో గొంతు హెచ్చించి అరవటం ప్రారంభించాడు. తన చెల్లెలు ఆ మాణిక్యాన్ని ప్రేమించడం ఏ మాత్రం సహించ లేకుండా ఉన్నాడతను. మాణిక్యం ఎంత అర్భకంగా ఉంటాడో ఇతను అంత బలిష్ఠుడూ ఆజానుబాహు డూను.

రామారావు కొడుకుని వారించారు. 'ఇది మీ బిడ్డ విషయం అయ్యుంటే అంత తేలిగ్గా మాట్లాడి ఉండరు మీరు. మతం, కులం, బంధువులు, సొంత కుటుంబం అంతటినీ ఒదులుకొని పోవడం మాటలు కాదు అన్నారు.

అసలే దుఃఖంలోవున్న వాళ్లను అనాలోచితంగా బాధపెట్టినందుకు నొచ్చుకున్నారు సారథి. 'మా బిడ్డ అయినా అంతే. ఏం చెయ్యగలం, చెప్పండి... కళ్లు తెరవడం దగ్గర్నుండీ తప్పటడుగుల దగ్గ ర్నుండీ లోకాన్ని పరిశీలించి అర్థం చేసుకోవడం వరకూ మన చాటునవుండి నేర్చుకున్న మనపిల్లలు మన విలువలను హర్షించడం లేదంటే ఆశ్చర్యంగా వుంది' అన్నారు.

సారథి ఆశ్చర్యాన్ని గమనించే స్థితిలోలేని రామారావు తన ధోరణిలో చెప్పుకుపోయారు. 'బంధు వుల్లో తలవంపులు చేసింది...తానూ చెడ్డది. అక్కనూ చెడగొట్టింది. పెద్దది చాలా మెతకపిల్ల. తల పైకెత్తడం అరుదనుకోండి. దాని పెళ్లి చెయ్యాలని నాలుగేళ్లనుండీ చూస్తున్నాం. ఒఖ్ఖ సమ్మంధం కూడా కుదిరిరాలేదు. బి. ఏ. దాకా చదివి టెంపరరీ గుమాస్తా ఉద్యోగంకూడా లేనివాడు పదివేలు కట్నం తెమ్మంటున్నాడు ఇప్పడిహ ఈ పిల్ల యీ పని చేసిం దంటే దానికి పెళ్లి ఎలా చెయ్యగలం!' అన్నారు కన్నీళ్ల తరవాయిగా.

'జరిగిపోయిన దానికి వగచి లాభం ఏమిటి?... మాణిక్యంకూడా నెమ్మదస్తుడిలాగే కనిపిస్తున్నాడు. నాలుగువందల జీతం అంటే తక్కువేమీకాదు. పర్మ నెంటు ఉద్యోగం. ఇంకా అభివృద్ధిలోకి వస్తాడు... కాలం ఇదివరకటి లాగాలేదు లెండి. మారిపోతున్నది. ఇప్పుడెవరూ ఇట్లాంటి విషయాల్ని అంతగా పట్టించు కోడం లేదు. ఊరికే బాధపడకండి' అని ఓదార్చారు సారథి. కళ్లల్లో పెట్టుకు కాపాడిన తల్లీదండ్రుల్ని ఇంత నొప్పిస్తున్న ఆ పిల్లమీద కోపంకూడా వచ్చింది.

'ఇంతచేటు జరిగాక వెధవ ఉద్యోగం, డబ్బూ చూసుకుని పొంగిపోవాలి!' రోషంగా అన్నాడా యువకుడు.

సారథిగారి ఓదార్పు మాటలు రామారావుగారి మీద పనిచేసినై. నాలుగునాళ్లనుండీ బాధపడి అలసి పోయిన మనసు ఏ గడ్డి పరకనో పట్టుకుని విశ్రాంతి తీసుకోవాలని ఆరాటపడుతున్నది. కొడుకు ఉద్రేకం ఆయనకు సరిపడలేదు. 'ఆ వెధవ ఉద్యోగమేదో ఒకటి నీకు దొరకలేదే! పెద్దవాళ్లముందు ఇట్లాగేనా మాట్లాడేది?' అంటూ మందలించారు. ప్రాధేయ పూర్వకంగా సారథితో అన్నారు. 'మీరు చెప్పిందీ నిజమే. ఇప్పుడిహ మేం చేసేది ఏముంది? ఇంకా ఎన్నాళ్లు తిరుగుతాం యిట్లాగ? వాళ్లమ్మ మంచం దిగలేదు. ఎప్పుడూ కూనిరాగాలు తీసుకుంటూ హాయిగా ఆటపాటల్తో గడిపిన పిల్ల. దేనికీ ఎదురుమాటచెప్పి ఎరగనిది. అది ఏమై పోతుందోనని వాళ్లమ్మ బెంగ. వాడు దాన్ని నిజంగా పెళ్లి చేసుకున్నాడో లేదో. పిల్ల ఎట్లా వున్నదో అన్ని విషయాలూ మీరే విచా రించి మాకు వ్రాయండి. అది బాగుందని తెలిస్తే మాకు తృప్తి. అంతకంటే ఎక్కువ సంబంధం దానికీ మాకూ ఎలాగూ ఉండదు. ఇహ దాని మొహం మేం ఎందుకు చూస్తాం! అది మీ బిడ్డే అనుకోండి. ఇవి చేతులుకావు. కాళ్లనుకోండి' అంటూ సారథి చేతులు పట్టుకున్నారు లేచి.

సారథిగారూ లేచి ఆయన్ని వారించి తాను స్వయంగా అన్ని విషయాలూ కనుక్కొని వ్రాస్తానని నచ్చచెప్పి పంపారు

వెనక కొడుకు బాగ్ పట్టుకొని నడుస్తుంటే రేగిన జుట్టుతో నలిగిన బట్టల్తో అలసిన మనస్సుతో ముందు నడుస్తున్న రామారావుగారిఎడల సానుభూతి లాంటిది కలిగింది సారథికి. 'పిల్లలు మరీ అన్యాయం అయిపోతున్నారు. బాధ్యత తెలీడంలేదు' అనుకున్నారు.

ఆ రోజు ఉదయం సారథిగారి పుత్రరత్నం మోహన్ కాలేజీనుండి పెట్టేపరువూతోసహా ఇంటికొచ్చేశాడు. పెద్దల అభిరుచులకు వ్యతిరేకంగా బాగా పెంచేసినజుట్టు నుదురంతా ఆక్రమించి కళ్ళకడ్డం పడటం తరవాయిగా వున్నది. ఇంకా మీసాలూ గడ్డాలూ రాలేదుగాని, ఒచ్చినప్పుడు వాటినికూడా ఘోరంగా పెంచేస్తానని సూచించాడు కూడాను. కళ్ళల్లోంచీ గర్వం ఒలకబోసుకుంటూ నవ్వుకుంటూ 'స్ట్రైక్ చేస్తున్నాం' అన్నాడు. 'ఇంగ్లీషులో చదువుకునే అవకాశం కావాలని'అన్నాడు.

'మీరు ఇంగ్లీషులోనే చదువుతున్నారుకదా' అన్నది ఆశ్చర్యంగా కళ్యాణి.

'అయితే మావాళ్ళందరికీ కావాలని' అన్నాడు.

రాష్ట్రంలోకెల్లా మంచికాలేజీ, మంచిహాస్టలూ వున్నదని సీటుకోసరం మూడువేలు డొనేషన్ కట్టి మరీ చేర్పించారు అక్కడ. ఊరికే యిలాంటి అర్థంలేని సమ్మెలుచేసి చదువు పాడుచేసుకుంటూ సోమరిగా తిరగటం సారథిగారికి నచ్చలేదు.

మోహన్ లోపలికివెళ్ళి కళ్యాణితో చెబుతున్న మాటలు పెద్దగా వినిపిస్తున్నై. హైస్కూల్లో చదువుతున్నప్పటినుండీ ఎప్పుడు కాలేజీకి పోదామా, ఎప్పుడు స్ట్రైక్‌చేద్దామాఅని కాచుకొనివున్నారట. క్రిందటేడాది ఒక్క స్ట్రైక్‌కూడా రాలేదు. ఇప్పుడైనా చెయ్యకపోతే 'కాలేజిలో చదివాం, స్ట్రైక్ చేశాం'అని ఎట్లా చెప్పుకునేది? అంటూ ఘాటుగా చెప్పుకుపోతున్నాడు. ఈ స్ట్రైక్ సందర్భంలో రైళ్ళు ఆపేశారట. పోస్టాఫీసుమీద రాళ్లేశారట. కాలేజిలో బీరువాల గాజుతలుపులూ, కిటికీలూ పగులగొట్టారట. అయ్యవార్లని తిట్టారట. కాలేజిని తగలబెట్టేద్దామా అనుకున్నారటగాని...మోహన్ నవ్వుతూ చెపుతున్న రసవత్తర వీరగాథల్ని ఆనందంతో అమ్మా ఆరాధనతో చెల్లెలూ వింటూ కూర్చున్నారు. ఇంత దాకా విన్న సారథిగారికి తలనొప్పిలాంటిది వచ్చింది.

'నాశనంచెయ్యడం సహజలక్షణంగాగలవాళ్ళు కొందరు అన్నికాలాల్లోనూ ఉంటారు. కాని యీ కాలంలో అది సర్వసామాన్యమయిపోతున్నది. మంచి మనసులుకల మంచిపిల్లలు వాళ్ల ఉత్సాహాన్ని నిర్మాణాత్మకంగా మానవ వికాసానికి ఉపయోగించడానికి బదులుగా వినాశానికి ఉపయోగిస్తున్నారు.

మార్పు అన్నది ప్రకృతి సహజమైనదీ, వికాసానికి ఆయువుపట్టూ కావచ్చును. ఇన్ని యుగాలుగా మానవజాతి సంతరించుకుంటూవస్తున్న మూలధనాన్ని పెన్నిధిని మన బుద్ధినైశిత్యంతో పరిశీలించి, విలువైనదాన్ని గ్రహించి మన పరిస్థితులకనుగుణంగా మలుచుకోవడం మార్పు అవుతుందిగాని దాన్నంతా నాశనంచేస్తే ఏం మిగులుతుంది?

'మనిషికి స్థిరత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ ప్రసాదిస్తున్న ఆ ధర్మం నశించిపోతే మానవజాతికే ముప్పు రాదా?' అనుకున్నారు సారథి విచారంగా.

2

మాణిక్యం చాల సాధువు. మొదట్లో భయపడి స్వరూపరాణి విషయం తనకేమీ తెలియదన్నాడు. తరువాత తాను స్వరూపను రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళి చేసుకున్నట్లు సర్టిఫికెట్టు తెచ్చి చూపించాడు. వెంటనే తీసుకెళ్ళి పెళ్ళిచేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆ అమ్మాయి బెదిరించినందువలననే యిలా చేశానన్నాడు. సారథిగారి కోరికమీద ఆ స్వరూపను వారింటికి తీసుకొనివచ్చాడు.

స్వరూపరాణి చూడముచ్చటగా వున్నది. కళ్యాణి దగ్గర సిగ్గుపడుతూ ఒదిగికూర్చుంది. ముక్తసరిగా, సిగ్గుపడుతూ మాట్లాడ్డం ఆ అమ్మాయి తరహా.

కాని మాటలు గమనిస్తే చాల ధైర్యంగలపిల్లని తెలుస్తున్నది.

తన అక్క ధర్మవాణికి తన తల్లిదండ్రులు ఇప్పట్లోనూ ఎప్పట్లోనూ పెళ్ళిచెయ్యగలరన్న నమ్మకం ఆ అమ్మాయి కున్నట్లులేదు. మాణిక్యం తల్లిదండ్రులులేని ఒంటరిగాడు గనుకనూ, అతని ఆరోగ్యం మంచిదికాదుగనుకనూ తానే దగ్గరుండి చూసుకోవాలని తొందరలో పెళ్ళిచేసుకున్నదట. తాను చేసిన పనిని తర్వాతనైనా తలిదండ్రులు హర్షిస్తారనే నమ్మకంతో వున్నది. ఆ అమ్మాయి తండ్రిదీ అన్నదీ ధోరణివిన్న కళ్యాణికి ఆ పిల్ల నమ్మకంచూసి చాల జాలి కలిగింది. 'మీవాళ్ళు నీవు చేసిన పనిని క్షమించవచ్చునుకాని మీ యింటికి వస్తారనిమాత్రం ఆశించకు' అని చెప్పింది. అంతా విని స్వరూప నవ్వి వూరుకున్నది.

పెద్దల అండదండలు లేకుండా సొంతంగా యిల్లు ఏర్పరచుకొని, కొత్తసంసారంతాలూకు ఒడిదుడుకుల్ని తట్టుకుంటూ దిద్దుకోవలసిన ఆ చిన్నపిల్ల మీద జాలితోపాటు అపేక్షకూడా కలిగింది కళ్యాణికి. ఇంటికి కావలసిన వస్తువులు ఏవి ఎక్కడకొంటే బాగుంటుందో సలహాలిచ్చి ధైర్యంచెప్పి పంపించింది.

వాళ్ళ విషయాలన్నీ వివరంగా రామారావుగారికి వ్రాశారు సారథి. ఇహ తమ బెంగ తీరిందంటూ ఆనందంతో కృతజ్ఞతా పూర్వకంగా ప్రత్యుత్తరం వ్రాశారాయన.

* * *

కాలేజీ పిల్లల సమ్మె సాగుతూనే ఉన్నది. మోహాన్‌కి పాతసినిమాహాలులంటే చిరాకు. అటువంటి హాల్సులో సినిమాలు చూస్తూ, ఇంట్లో కూర్చొని వుండటం చురుకూ దుడుకూగల స్వభావానికి కష్టంగా ఉన్నది. అయినా సమ్మె కొనసాగించే విషయంలో మాత్రం కృతనిశ్చయంతోనే ఉన్నాడు.

కొడుక్కి యుక్తాయుక్త వివేచన కలిగించాలనే భావం కలిగింది సారథిగారికి.

'రైలూ పోస్టాఫీసూ మన అవసరాలుకదా. సమ్మె అంటూ వాటిని పాడుచేసుకోడం బాగాలేదు' అన్నారు.

మోహన్‌కి ఈ లోకంలో వుండే ప్రతిప్రశ్నకూ సమాధానం తెలుసు.

'వెంటనే బాగుచేస్తారు వాళ్ళు' అన్నాడు.

'వాళ్ళెవరు?'

'ప్రభుత్వం'

'ప్రభుత్వం అంటే దానికి డబ్బుకట్టేది మనమేకదా. మనకే నష్టం'

'ఇదంతా చెయ్యకపోతే వాళ్ళు వినరే! ఇట్లా చేస్తే పరీక్షలు ఎప్పుడు పెట్టమంటే అప్పుడు పెడతారు. జీతాలు తగ్గించమంటే తగ్గిస్తారు. ఫలానా పుస్తకాలు చదవం అంటే ఎత్తేస్తారు. ఏం చెబితే అట్లా చేస్తారు.'

'అయినా యిట్లాంటి నాశనం చేసేపనులు మంచివికావు. వాళ్ళైనా చిన్నవిషయాల్లో కొన్నిట్లో వెనక్కిపోయి వుండొచ్చు. ఇది అట్లాంటిదికాదే. పెద్దవాళ్ళు దీన్ని క్షుణ్ణంగా పరిశీలించి, మాతృభాషలో విద్యాబోధనవలన మీకూ దేశానికీ మంచిదనే నిర్ణయానికివచ్చిన మీదట చేసిన పని. దీంట్లో వాళ్ళు వెనక్కిపోరు. ఇదంతా పిల్లల ఆటాకాదు. వాళ్ళు పిల్లలూ కారు'.

మాకు మంచిదనితోస్తే ఎందుకు కాదంటాము?...ఈ నిర్ణయాలు చేస్తున్న వాళ్లలో చాలామంది పిల్లలూ మనమళ్ళూ ఇంగ్లీషులోనే చదువుతున్నారు. చెప్పేదొకటీ చేసేదొకటీ అయితే ఎవరు నమ్ముతారు?' అన్నాడు మోహన్ ఎగతాళిగా.

'ఇంతపెద్ద సమస్యలు పరిష్కరించవలసి వచ్చినప్పుడు నీవూ నేను అంటూ ఆలోచిస్తే కుదరదు. విశాలమైన దృక్పథంతో ఆలోచించాలి.'

'అదంతా మాకు తెలియదు. ఇంగ్లీషువలన ఒచ్చే లాభాలన్నీ కొందరిక్కావాలి. విశాల దృక్పథం వలన కలిగే ఫలితాలు మిగతా వాళ్లకు చెందాలిఅంటే మేం ఒప్పుకోం' అన్నాడు మొండిగా.

సారథిగారు ఈ విషయంలో ఎక్కువ మాట్లాడ లేకపోయారు.

'మీకు స్వార్థంతప్ప యింకోటి అర్థం అయ్యేట్లు లేదు...సరే, మీ కాలేజీ భవనాలు తగలబెట్టెయ్యాలను కున్నానుంటివే. మంచిసదుపాయాలుండే కాలేజిఅని అక్కడచేరి దాన్ని తగలబెట్టుకుంటే ఎవరికి నష్టం?' అని అడిగారు.

'తగలబెట్టలేదుగా. ఊరికే అనుకున్నాం. ఎన్నో అనుకుంటాం.'

'కనీసం మీ మంచి ఏదో తెలుసన్నమాట... ఇప్పుడుమాత్రం ఊరికే చదువు పోగొట్టుకుంటూ సోమరిగా కాలం గడుపుతున్నారు. ఎట్లాగూ యీ ప్రాక్టిక్‌లో గెలవలేరు. ఇది ఎవరికి మంచి?' అన్నారు సారథి విసుగ్గా.

మోహన్ నవ్వి ఊరుకున్నాడు.

3

కాలేజీ విద్యార్థుల సమ్మె విజయవంతంగా ముగిసింది. ఇంగ్లీషులో నూటికి నలభై మార్కుల కంటే హెచ్చుగా తెచ్చుకున్నవాళ్లందరికీ ఇంగ్లీషులో చదువుకునే అవకాశం కల్పిస్తామని ఒప్పుకున్నారు ప్రభుత్వం. వాళ్లు యిలా వెనక్కుపోవడం సారథిగారికి ఆశాభంగం కలిగించింది. నిస్పృహకూడా కలిగింది. ఈ పరిస్థితుల్లో యువతరం బాధ్యత లెరిగిన వ్యక్తులుగా రూపొందడం సాధ్యంకాదు. దానిక్కారణంకూడా పెద్దల్లోనే ఉన్నది. స్వార్థంతప్ప మరో ధర్మంలేని ప్రపంచం కుక్కలు చింపిన విస్తరికాదా? అప్పుడు ప్రపంచాన్ని ఏకంచేసేదీ, రక్షించేదీ అయిన సత్యం ఎక్కడుంటుంది? ఎటు చూచినా నిరాశాజనకమైన నల్లనిచీకటి కనిపించింది సారథికి.

పెద్దజ్యోతిని ఎంబ్రాయిడర్‌చేసిన గురుషర్టు వేసుకొని వెలుగురేకలాగా దూసుకొచ్చాడు మోహన్, 'నేను యివాళే కాలేజికి వెళ్లిపోవాలి. అటెండెన్సు పోతుంది'అని ఆత్రపడిపోతూ.

'సరే, వెళ్లువు. మొత్తానికి మీరే గట్టివాళ్లురా. గెలిచారు' అన్నారు సారథి.

'నాన్నా, మీ స్నేహితులు తెనాలి రామారావుగారొచ్చారు...'అంటూ లోపలికొచ్చింది గౌరి. 'కూర్చోమని చెప్పావా?' అంటున్న తండ్రి ప్రశ్నను విననట్లు లోపలికి వెళ్లిపోయింది.

సారథి వరండాలోకి వెళ్లేసరికి కుర్చీ లాక్కుని కూర్చునిఉన్నారు రామారావు. 'అబ్బ, ఊరికి మరీ యింతదూరాన తీసుకున్నారు యిల్లు...మీదగ్గరికి ఎవరైనా రావాలంటే కష్టం' అన్నారు నవ్వుతూ, చెమట తుడుచుకుంటూ.

ఆయన ఇదివరకటి దిగారిల్లి పోయిన మనిషి కాదు యిప్పుడు. సంతోషంగా ధైర్యంగా ఉన్నారు. స్నానంచేసి, తలదువ్వుకొని, చలువ బట్టల్లో శుభ్రంగా ఉన్నారు. వెంట బాగ్ లేదు.

'మీ అమ్మాయి ఎలా వుందో స్వయంగా చూచి వెళ్లాలని ఒచ్చారా? వాళ్ల సంసారం సవ్యంగా ఉన్నదా? అమ్మాయికేమీ కష్టంలేదు గద?' అంటూ కుశలప్రశ్నలు వేశారు సారథి.

'మా అమ్మాయి కింకేం ఫరవాలేదండి. మాణిక్యంకూడా మంచివాడు...ఏం కష్టముంటుంది'... అన్నారు రామారావు ఉత్సాహంగా. ఏదొచ్చినా పట్టలేని భోళామనిషి అతను.

'అవుననుకోండి...అయినా, మీరు ఇదివరలో చెప్పినట్లు మతం మార్చుకోడం చిన్నవిషయంకాదు. అందులో హిందూమతానికి చెందినవాళ్లు యితర మతస్థుల్ని పెళ్లాడితే మరింత కష్టం. ఎందువల్లనంటే హిందూమతం అన్నది కేవలం దైవధ్యానానికీ స్థూలంగా నైతిక దృక్పథానికీ మాత్రమే పరిమితమైనదికాదు. దైనందిన కార్యకలాపాలన్నిటిలోకీ చొచ్చుకొనిపోయి, అంతటినీ చైతన్యవంతం చెయ్యడానికి పూనుకొన్న పద్ధతి గలది. అందువలన...'

సారథిగారి మాటల్ని తేలిగ్గా తోసేశారు రామారావు.

'అందరం రక్తమాంసాలతో ఏర్పడిన మనుష్యులమే. ఏ పేరు పెట్టుకున్నా ఆ దేవుడూ ఒకడే.

అయినప్పుడు మధ్యన యీ భేదాలన్నీ ఊరికే తెచ్చిపెట్టుకున్నవే గదా. మనది ఉత్తమమైన సెక్యులర్ రాజ్యాంగపద్ధతి. మహాప్రవక్తల దగ్గర్నుండీ గొప్ప వాళ్లంతా కులాలూ మతాలూ లేవంటూంటే, కులాంతర మతాంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూవుంటే మీవంటి తెలివిగలవారు ఉదార స్వభావులు యింకా పాతకాలపు మాటలు మాట్లాడ్డంలో అర్థంలేదు... మా అమ్మాయి పెళ్లి గురించి మా బంధువులందరూ మొహాలు తప్పించి గుసగుసలాడుకున్నారండీ. ఆ, ఎక్కడైనా బంధువులకుండే రోగమే అంత. వాళ్లకంటే బయటవాళ్లే ఎంతో మేలు. అసూయా, కుత్సితమూ లేకుండా వుంటారు. అక్కడ మా క్లబ్బు వాళ్లకి చిన్నపార్టీ యిచ్చానులెండి అమ్మాయి పెళ్లి సందర్భంగా. అప్పుడు వాళ్లు నన్ను ఆకాశానికెత్తేశారు. సంస్కర్తననీ విశాలభావాలు కలవాణ్ణనీ అన్నారు. అయినా నా గొప్ప ఏముంది లెండి. పిల్లలు ముందడుగు వేశారు. ఇప్పుడిలాంటివన్నీ పెద్దవాళ్లిళ్లలో కొల్లలు.. అంతేకాకుండా అన్నింటికంటే ముఖ్యవిషయం మా రూప కోరుకున్న వాడిని చేసుకొని చేతినిండా డబ్బుతో సుఖంగా ఉన్నది. అంతకంటే ఏం కావాలి!...ఎట్లైనా అది మొదట్నుండీ మంచి తెలివిగల పిల్ల. ఇంకా చెప్పాలంటే మా పెద్దపిల్ల అంత చురుకైనదికాదు...'

ఆయన ధోరణికి సారథి ఆశ్చర్యపోయారు. ఆయన ఇదివరలో మాట్లాడిన తీరుకూ, యిప్పుడు వెలిబుచ్చుతున్న అభిప్రాయాలకూ ఏమీ సంబంధం లేకుండా వున్నది!

కాబట్టి ఆయన్నిగురించి ఆయనకు తెలిసిన దానికంటే ఆయన కూతురు స్వరూపకే ఎక్కువ తెలుసన్నమాట! పెద్దలు తమ మనసు తాము తెలుసుకోకుండా, చెప్పేది చెయ్యలేకుండావున్నప్పుడు వారు నమ్మలేకుండావున్న సూత్రాల్ని పిన్నలు త్రోసిరాజనటంలో ఆశ్చర్యమేమీలేదు. స్వార్థమూ ధైర్యమూ కలసియిచ్చే ఉత్సాహంతో, ఆలోచనల బరువులేకుండా ముందుకు సాగిపోతున్న పిన్నలు వయసుకు పెద్దలైనవారు పరిష్కరించుకోలేని సమస్యలను విడదీస్తూ వారు త్రెంచుకోలేని శృంఖలాలను ఛేదిస్తూపోతున్నారు.

రామారావుగారిలో స్థిరమైన నమ్మకాలూ లేవు, ఉన్నతమైన వ్యక్తిత్వమూలేదు. కాని ఆయనలో ఉన్న స్థిరత్వం, సత్యం ఆయనకూ కూతురికీ మధ్యన వున్న సంబంధంలో ఉన్నది.

సత్యస్వరూపుడైన భగవంతుడు మనిషిలోనూ లేడు. మనిషి పూజించేమూర్తిలోనూలేడు. మనిషికీ మూర్తికీ మధ్యనఉన్న సంబంధంలోనే ఉన్నాడు.

ఆ సంబంధం జీవించివున్నంతకాలం, దాన్ని మనుష్యులు ఒక గ్రామఫోను రికార్డుగా మార్చనంత కాలం, ఒక మనిషి యింకో మనిషిని ప్రేమించినంత కాలమూ—

తండ్రికీ కొడుక్కీ మధ్యగా వారి తలలపై ఎగురుతూ నిలిచివుండి వారిద్దరినీ ఏకంచేస్తుండే పవిత్రాత్మ ప్రపంచాన్ని రక్షిస్తూనే ఉంటుంది!

రామారావుగారు తమ స్వరూపను కాదనుకోనందుకు సంతోషిస్తూ 'ఇంతట్లో మా మోహన్‌కి వచ్చిన గొప్పలోటేమీ లేదేమో. వాళ్లనీ సురక్షితంగా నడిపించేది ఏదో ఉన్నది' అనుకొని నిట్టూర్చారు సారథి.

———